## క్లుప్తంగా

### ప్రజలకు ఇబ్బంది లేకుండా..



ఎస్సీకాలనీలో రోలర్‌తో రోడ్లు చదును చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: కాలనీవాసులకు ఇబ్బందులు లేకుండా రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు రామిరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలోని ఎస్సీకాలనీలో అంతర్గత రోడ్లను చదును చేసే పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.4.90 లక్షలతో మట్టిరోడ్లు నిర్మించామన్నారు. వాటిని రోలర్‌తో చదును చేసి వాటిపై గ్రావెల్ విడిపించి చదును చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు వర్షాకాలంలో ఇబ్బందులు లేకుండా చూస్తామని చెప్పారు.

### పరీక్షా కేంద్రాల తనిఖీ



సున్నిపెంట పరీక్షా కేంద్రంలో తనిఖీ చేస్తున్న పీఓ రవీంద్రారెడ్డి

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంటలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను బుధవారం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్.బి.రవీంద్రారెడ్డి తనిఖీ చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గిరిజన గురుకుల పాఠశాల కేంద్రాలలో జరుగుతున్న పరీక్షల శైలిని పర్యవేక్షించారు. మాస్‌కాపీయింగ్ జరుగకుండా ఇన్విజిలేటర్లు చూడాలన్నారు. వేసవి దృష్ట్యా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు విద్యార్థులకు అందించాలని, ఇతర మందులను కూడా అందుబాటులో ఉంచి ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యసిబ్బందికి సూచించారు.

### బాలికల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: బాలికల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పావని రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మండ్లెం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బేటీ బచావో - బేటీ పఢావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ బాలికల పట్ల తల్లిదండ్రుల చిన్న చూపు తగదన్నారు. వారికి అబ్బాయిలతో సమానంగా అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు ఇందిరమ్మ, ప్రమీలమ్మ, పద్మావతి పాల్గొన్నారు.

### వైభవంగా భ్రమరాంబా మల్లికార్జున స్వామి కల్యాణం



కొణిదేలలో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని కొణిదేల గ్రామంలో మంగళవారం రాత్రి 11.50 గంటలకు శ్రీ భ్రమరాంబామల్లికార్జున స్వామి వార్ల కల్యాణోత్సవాన్ని గ్రామస్తులు, భక్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక అలంకరణ చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నట్లు దేవాలయ అర్చకుడు భాస్కరయ్య తెలిపారు.

**నేడు బండలాగుడు పోటీలు**

బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ నవీన్ తెలిపారు. పోటీలలో విజేతలకు నగదు బహుమతులను అందజేస్తామన్నారు.

### సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల కవాతు



జూపాడుబంగ్లాలో కవాతు నిర్వహిస్తున్న బీఎస్‌ఎఫ్ ఫోర్స్

జూపాడుబంగ్లా: మండలంలోని సమస్యాత్మక ప్రాంతాలైన జూపాడుబంగ్లా, పారుమంచాల, తర్తూరు గ్రామాల్లో బుధవారం నందికొట్కూరు రూరల్ సీఐ ఆధ్వర్యంలో బీఎస్‌ఎఫ్ ఫోర్స్( కేంద్ర బలగాలు) సిబ్బందితో పోలీసు కవాతు నిర్వహించారు. ప్రధాన రహదారితో పాటు ఎస్సీ, బీసీ కాలనీలలో కవాతు చేపట్టి స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎస్‌ఐలు జయశేఖర్, జగన్‌మోహన్, నాగార్జున, ఏఎస్‌ఐ మేరీ తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నలకు అండగా ఆర్బీకేలు

- సొంత గ్రామాల్లోనే ఎరువులు, విత్తనాలు
- మద్దతు ధరలో దిగుబడుల విక్రయానికి అవకాశం
- ఈ-క్రాప్, రైతు భరోసా నమోదు

ఆత్మకూరు: రైతన్నల సంక్షేమానికి కృషి చేస్తామని ఎన్నికల ముందు పాదయాత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చారు. రైతు సంతోషంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని, రైతే రాజని నమ్మి వారి సంక్షేమానికి పెద్ద పీట వేసిన తన తండ్రి దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి అడుగుజాడల్లో నడస్తూ గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా గ్రామాల్లోనే రైతులకు సాగుకు అవసరమైన అన్ని రకాల సేవలు అందిస్తున్నారు. అలాగే దిగుబడులు విక్రయించుకునే ఏర్పాటు కూడా చేశారు. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**అన్ని ఆర్బీకేల్లో ఎరువులు, విత్తనాలు, యంత్రాల పంపిణీ**

రాష్ట్రంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో రైతులకు సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు అందించడమే కాకుండా వ్యవసాయ పనిముట్లను , ట్రాక్టర్లను అందజేస్తున్నారు. వ్యవసాయ సిబ్బంది రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అన్ని వేళల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. పంటలు చేతికందాక దిగుబడులు విక్రయించుకునే సౌకర్యం కూడా కల్పించారు.

**ఈ-క్రాప్ బుకింగ్ నుంచి నష్టపరిహారం వరకు**

ఖరీఫ్, రబీ పంటల నమోదుకు సంబంధించి ఈ-క్రాప్ బుకింగ్ రైతు భరోసా కేంద్రాల్లోనే చేస్తున్నారు. ఇక్కడే పంట నష్టపరిహార వివరాలు, పంటల గిట్టుబాటు ధరలు నమోదు చేయడమే కాకుండా అతివృష్టి, అనావృష్టి ప్రభావాలకు దెబ్బతినే పంటలను సైతం వ్యవసాయ సిబ్బంది గుర్తించి, బాధిత రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపుతున్నారు.

**ఆర్బీకేల్లో ఎరువుల నిల్వలు..**

ఆత్మకూరు డివిజన్ పరిధిలోని అన్ని ఆర్బీకేల్లో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ఆత్మకూరు మండలంలో 749.99 క్వింటాళ్లు, వెలుగోడు మండలంలో 59.96 క్వింటాళ్లు, పాములపాడు మండలంలో 299.93 క్వింటాళ్లు, కొత్తపల్లిలో 272 క్వింటాళ్లు, బండిఆత్మకూరు మండలంలో 299.92 క్వింటాళ్లు, మహానంది మండలంలో 40 క్వింటాళ్ల ఎరువులు రైతులకు అందుబాటులో ఉన్నాయి. రైతులు రైతు భరోసా కేంద్రాల్లోనే రసాయనిక ఎరువులు కొనుగోలు చేయాలని వ్యవసాయాధికారులు పేర్కొన్నారు.



కరివేన రైతు భరోసా కేంద్రం

**శిక్షణ కార్యక్రమాలు**

రైతన్నలు వ్యవసాయం సాగు చేసే సమయంలో పంటలు దెబ్బతినకుండా, అధిక దిగుబడి సాధించేందుకు రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు ఉచితంగా శిక్షణా కార్యక్రమాలను అందిస్తున్నారు. పంటలకు చీడ, పీడ సోకితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా, పంటల బీమా, నష్టపరిహారం తదితర వాటి నమోదుపై శిక్షణ ఇవ్వడమే కాకుండా రైతన్నల సమస్యలు తెలుసుకుని అధికారులు, శాస్త్రవేత్తలతో సలహాలు, సూచనలు ఇప్పిస్తున్నారు.

**డివిజన్ పరిధిలో మండలాల వారీగా రైతు భరోసా కేంద్రాల వివరాలు**

| మండలం | ఆర్బీకేల వివరాలు |
|---|---|
| ఆత్మకూరు | 12 |
| వెలుగోడు | 11 |
| పాములపాడు | 03 |
| కొత్తపల్లి | 11 |
| బండిఆత్మకూరు | 14 |
| మహానంది | 11 |

**సొంత ఊరిలోనే ఎరువులు కొనుగోలు చేస్తున్నాం**



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటి నుంచి ఖరీఫ్, రబీలో పంటలు సాగు చేసే సమయంలో ఎరువులు ఇక్కడే కొనుగోలు చేస్తున్నాం. గతంలో ఆత్మకూరు పట్టణానికి వెళ్లి ఎరువులు తెచ్చుకునేవాళ్లం. అందుకు వ్యయ ప్రయాసలకు గురయ్యేవాళ్లం. రైతు భరోసా కేంద్రం సొంత ఊరిలో ఉండడం వలన ఇబ్బందులు తప్పాయి. – వెంకటసుబ్బయ్య, నల్లకాల్వ

**దళారుల బెడద తగ్గింది**



గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో పంట నమోదు చేయడం ఎంతో సంతోషంగా ఉంది. ఏ పంట వేస్తున్నాం, ఎంత విస్తీర్ణంలో పంట సాగు చేస్తున్నాం, అన్ని వివరాలను నమోదు చేస్తున్నారు. ఇంకా ప్రభుత్వ మద్దతు ధరలతో సొంత ఊరిలో పంటలు కొనుగోలు చేయడం వలన దళారుల బెడద తగ్గింది. ఆర్బీకేల వలన ఎన్నో ప్రయోజనాలను కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృతజ్ఞతలు. –వెంకటరమణ, బాపనంతపురం

### వైభవంగా మహానందీశ్వరుడి కల్యాణోత్సవం



కల్యాణ పూజల్లో మహానందీశ్వర దంపతులు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి దంపతులకు బుధవారం కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. పట్టువస్త్రాలు, పుష్పమాలలతో స్వామి,అమ్మవారిని అలంకరించి గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, కల్యాణోత్సవ పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు.

### రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొనొద్దు

కొత్తపల్లి: ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది ఏ రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొనవద్దని ఎంపీడీఓ జవహర్‌బాబు సూచించారు. బుధవారం ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎలక్షన్ కమిషన్ నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే సస్పెండ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా 2023-24 సంవత్సరానికి గాను లేబర్ అచీవ్‌మెంట్ టార్గెట్‌ను అధిగమించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ రేష్మ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ఇంగ్లిష్ పరీక్ష

మిడుతూరు: మండల కేంద్రమైన మిడుతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ ఆదర్శ పాఠశాల, కడుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి పరీక్షా కేంద్రాలను ఎంఈఓ, ఫ్లైయింగ్ స్క్వాడ్ బ్రహ్మం నాయక్ బుధవారం తనిఖీ చేశారు. ఏపీ ఆదర్శ పాఠశాలలో 195 మందికి 160 మంది హాజరయ్యారని, కడుమూరులో 155 మందికి 19 మంది గైర్హాజరయ్యారని, మిడుతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 165 మంది విద్యార్థులకు 145 మంది హాజరయ్యారని తెలిపారు.

పగిడ్యాల: మండలంలో ఏర్పాటు చేసిన పాత ముచ్చుమర్రి, పగిడ్యాల జెడ్పీ పాఠశాల, లక్ష్మాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షా కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ పాములపాడు ఎంఈఓ బాలాజీ నాయక్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

పాములపాడు: బుధవారం నిర్వహించిన పదో తరగతి ఇంగ్లిష్ పరీక్షకు 21 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ ఎగ్జామినర్లు వెంకటేశ్వర్లు, రమణ తెలిపారు. ఏఎన్‌ఆర్‌జెడ్పీహెచ్ స్కూలులో 192 మందికి 182, ఏపీ మోడల్ స్కూలు 412 మందికి 391 మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు.



మిడుతూరు పరీక్ష కేంద్రంలో ఫ్లయింగ్ స్క్వాడ్

కొత్తపల్లి: పదో తరగతి ఇంగ్లిష్ పరీక్షకు 225 మంది విద్యార్థులు హాజరయ్యారని పరీక్షల నిర్వహణ అధికారులు ఇబ్రహీం, రఘుస్వామి తెలిపారు. కొత్తపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 167 మందికి 146, గోకవరం పాఠశాలలో 97 మందికి 79 మంది హాజరయ్యారని తెలిపారు.

మహానంది: పదో తరగతి పరీక్షకు బుధవారం 52 మంది గైర్హాజరైనట్లు బండిఆత్మకూరు మండల విద్యాశాఖాధికారి మోహన్‌రెడ్డి తెలిపారు. సంతజూటూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో 20 మంది, బండిఆత్మకూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో 16 మంది, ఏపీ మోడల్ స్కూల్‌లో 16 మంది గైర్హాజరైనట్లు చెప్పారు. మొత్తం 521 మంది పరీక్షలు రాశారన్నారు. మహానంది మండలంలోని తిమ్మాపురంలో రెండు, గాజులపల్లెలో రెండు సెంటర్లలో పరీక్షలు జరిగాయి.

ఆత్మకూరు: పట్టణంలో జరుగుతున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు బుధవారం 89మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ జానకీరామ్ తెలిపారు. చైతన్య హైస్కూల్‌లో 24 మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 14, జిల్లా పరిషత్ ఉర్దూ హైస్కూల్‌లో 9, జిల్లా పరిషత్ హైస్కూల్ బాలికల పాఠశాలలో 15, పద్మా వతి హైస్కూల్ 12, డిపాల్ హైస్కూల్‌లో 10, గౌతమి హైస్కూల్‌లో ఐదుగురు గైర్హాజరయ్యారన్నారు.

వెలుగోడు: మూడో రోజు బుధవారం నిర్వహించిన ఇంగ్లిష్ పరీక్షకు మండలంలో 28 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 225 మందికి గాను 219 మంది, ఏపీ మోడల్‌లో 244 మందికి గాను 234, డీపాల్ స్కూల్‌లో 232కు గాను 220 మంది హాజరయ్యారు.

### అభ్యర్థుల వ్యయ లెక్కింపుపై అప్రమత్తంగా ఉండండి

నంద్యాల: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వ్యయ లెక్కింపుపై అప్రమత్తంగా ఉండాలని, ఇందుకు సహాయ వ్యయ లెక్కింపు అధికారులు, వీడియో సర్వేలైన్ టీమ్‌లు, వీడియో వ్యూవింగ్ టీమ్‌లు పూర్తి స్థాయి శిక్షణ పొందాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థుల ఎన్నికల వ్యయ పరిమితిపై సహాయ లెక్కింపు, వీడియో సర్వే లైన్ టీం అధికారుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం సూచించిన మేరకే ఖర్చు చేయాల్సి ఉంటుందని, ఈ మేరకు ఖర్చును లెక్క కట్టి ప్రతి రోజూ నివేదికలు ఇవ్వాలని సూచించారు. బహిరంగ సభలు, ర్యాలీలు, ప్రకటనలు, పోస్టర్లు, బ్యానర్లు, వాహనాలు, ఆహార పదార్థాల ఖర్చులతో సహా లెక్కించాలని చెప్పారు. సి విజిల్ యాప్, ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టం ఏర్పాటు చేశారని, ఎన్నికల్లో మద్యం, డబ్బు, ఇతర వస్తువుల రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్నికల వ్యయ నోడల్ అధికారి వెంకటసుబ్బయ్య, ఏఎస్పీ కె.ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు

### పిచ్చుకలను కాపాడుదాం

నంద్యాల(వ్యవసాయం): అంతరించి పోతున్న పిచ్చుకలను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని విశ్రాంత శాస్త్రవేత్త, నంది రైతు సమాఖ్య గౌరవాధ్యక్షుడు, డాక్టర్ రవీంద్రనాథ్ పేర్కొన్నారు. బుధవారం సమాఖ్య కార్యాలయంలో ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా.. జీవవైద్యంలో పిచ్చుకలు కీలకం అనే అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ దీవీహయగ్రీవాచార్యులు, వ్యవసాయరంగ నిపుణులు మాధవస్వామి, కైలాసనాథరెడ్డి, దంతవైద్యులు కిశోర్‌కుమార్, రైతు ఓబులపతి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ పిచ్చుకలు రైతుల నేస్తాలు అని, పొలాల్లోని క్రిమికీటకాలను తింటూ రైతుకు సహాయకారిగా ఉంటాయన్నారు. కాగా..నేడు వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.

### చెరువూ మాదే...చేపలూ మావే!

మహానంది: ఒకటి కాదు, రెండు కాదు వేల సంఖ్యలో కొంగలు. మహానంది మండలం తమ్మడపల్లె సమీపంలోని ఇంజవాణి చెరువంతా మాదే అంటూ ఆహారం కోసం అన్వేషిస్తున్నాయి. సాయంత్రం కాగానే చెట్లపైకి చేరుతూ విశ్రాంతి తీసుకుంటున్నాయి. అటుగా వెళ్లే పర్యాటకులు, ప్రయాణికులు చెరువులో కనిపించే శ్వేతవర్ణపు పక్షులను చూసి ఆనందిస్తున్నారు.



### సువిధ పోర్టల్ ద్వారా అనుమతులు

నంద్యాల(అర్బన్): భారత ఎన్నికల సంఘం సువిధ పోర్టల్ అనే సింగిల్ విండో విధానాన్ని ప్రవేశపెట్టిందని నంద్యాల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీని ద్వారా రాజకీయ పార్టీలు, అభ్యర్థి లౌడ్‌స్పీకర్లు, ర్యాలీలు, సభలు, సమావేశాలు, వాహనాల వినియోగం, ప్రచారం, బ్యానర్లు, జెండాల ప్రదర్శన, కరపత్రాల పంపకం వంటి వాటి అనుమతులకు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ద్వారా పొందవచ్చన్నారు. ప్రైవేటు స్థలాలు, భవనాలపై హోర్డింగ్‌లు పెట్టుకునేందుకు సంబంధిత దరఖాస్తులను ఆమోదించుటకు, జారీ చేయుటకు అవకాశం లేదని పేర్కొన్నారు.

### బైరెడ్డి నగర్‌లో వేగంగా సీసీ రోడ్లు

నందికొట్కూరు: బైరెడ్డి నగర్‌లో రూ.1.30 కోట్లతో సిమెంట్ రోడ్ల నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నట్లు కౌన్సిలరు మంగళి కృష్ణ తెలిపారు. బుధవారం పట్టణంలోని పగిడ్యాల రోడ్డులో ఉన్న బైరెడ్డి నగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కాలనీలో 22 రోడ్లను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కాలనీ ఏర్పడి 40 ఏళ్ల గడుస్తున్నా రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు.



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్

### ఎన్నికల కోడ్ అమలుకు సహకరించాలి

నందికొట్కూరు: సార్వత్రిక ఎన్నికల కోడ్ నిబంధనలు తప్పనిసరిగా పాటించి, సహకరించాలని మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి కోరారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. గృహాలపైన, వాహనాలపైన, ఇతర ప్రాంతాలలో ఆయా పార్టీల ఫ్లెక్సీలు, స్టిక్కర్లు జెండాలను ఉంచరాదని చెప్పారు. సమావేశంలో డీఈ నాయబ్ రసూల్, టౌన్ ప్లానింగ్ అధికారి బాలమద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

### మందకృష్ణపై వ్యాఖ్యలు బాధాకరం

మహానంది: ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగపై ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకరావు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బాయికాటి బెనర్జీ, జిల్లా అధికార ప్రతినిధి పూల వెంకటసుబ్బన్న తెలిపారు. బండిఆత్మకూరులో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్న మందకృష్ణ మాదిగకు సహకరించాల్సింది పోయి విమర్శలు చేయడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కత్తి ఓబులేసు, మండల అధ్యక్షుడు బాలస్వామి, దశరథుడు తదితరులు పాల్గొన్నారు.

### నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

మహానంది: వలంటీర్లు, సచివాలయ సిబ్బంది రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొనరాదని బండిఆత్మకూరు ఎంపీడీఓ విజయరావు తెలిపారు. బండిఆత్మకూరు ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

### రాజకీయ నాయకుల ఫొటోలు ఉండరాదు

పాములపాడు: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీల నాయకుల చిత్రపటాలు, ఫ్లెక్సీలు బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదని ఎంపీడీఓ సరస్వతి అన్నారు. బుధవారం మండలంలోని మిట్టకందాల, మద్దూరు, వానాల గ్రామాల్లో పర్యటించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎక్కడా ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రి ఫొటోలు లేకుండా చేయడం జరిగిందన్నారు. ఏ రాజకీయ పార్టీ వారైనా ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట హెడ్ కానిస్టేబుల్ రామేశ్వర్ ఉన్నారు.

### ఎన్నికల నియమావళి పాటించకపోతే చర్యలు

శ్రీశైలంప్రాజెక్ట్: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో రాజకీయ పార్టీల వారు, అధికారులు, వలంటీర్లు, ఉద్యోగులు ఎన్నికల నియమావళికి అనుగుణంగా వ్యవహరించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని శ్రీశైలం తహసీల్దార్ గుర్రప్ప హెచ్చరించారు. బుధవారం తన కార్యాలయంలో సిబ్బంది, వలంటీర్లు, విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వలంటీర్లు రాజకీయ పార్టీల కోసం ప్రచారం చేసినా, ప్రభుత్వ ఉద్యోగులు ప్రచార కార్యక్రమాలలో పాల్గొనినా చట్టపరంగా ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. రాజకీయపార్టీల నాయకులు, కార్యకర్తలు పార్టీజెండాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదని, ఏదైనా కార్యక్రమాలు చేయదలిస్తే అనుమతి తీసుకోవాలని చెప్పారు. విలేకరులు పార్టీలకు అతీతంగా సమాచారాన్ని ఇచ్చి సహకరించాలని కోరారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ గుర్రప్ప

### వైభవంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠ

వెలుగోడు: మోతుకూరు గ్రామంలోని ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన బుధవారం వైభవంగా జరిగింది. స్వామివారి సన్నిధి ఎదుట నూతన ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మొదట ఉత్సవమూర్తిని సర్వాంగసుందరంగా అలంకరించారు. తర్వాత పూజారులు, వేదపండితులు హోమం వెలిగించి మంత్రోచ్చారణలతో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పంచమూర్తులైన స్వామి, అమ్మవార్లు, వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, కన్నప్ప, చండీకేశ్వరుని పేర్లతో ధ్వజ స్తంభానికి నాలుగు దిక్కుల పూజలు చేశారు. కలశాలలోని పవిత్ర జలాలను, రాగి నాణేలను ఉంచి ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఆగమశాస్త్రం ప్రకారం ధ్వజస్తంభాన్ని ఆవిష్కరించారు. పూజా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, నాయకులు నాగేశ్వరరెడ్డి, బోగోలు బాల సుబ్బయ్య, రామసుబ్బారెడ్డి, రామలింగారెడ్డి, బోగోలు సుదర్శనం, మంగారపు గుర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమాల్లో శిల్పా భువనేశ్వర్‌రెడ్డి

### ఆర్టీసీ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు



మెగా చెక్కు అందజేస్తున్న ఆర్టీసీ డీఎం మహేంద్రుడు

ఆత్మకూరు: పట్టణంలోని ఏపీఎస్ ఆర్టీసీ డిపోలో ఫిబ్రవరి నెలలో అధిక ఆదాయం, కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు, కండెక్టర్లకు డిపో మేనేజర్ మహేంద్రుడు ప్రశంసా పత్రాలు, అవార్డులను బుధవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి నెలలో రాష్ట్రంలోనే రెండవ స్థానం సాధించిన మహిళా కండెక్టర్లు, కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లను అభినందించినట్లు చెప్పారు. అత్యధిక ఆదాయం తెచ్చిన కండెక్టర్లు జీపీఎల్‌రెడ్డి, ముర్తుజా బీ, స్వామి, జ్యోతి, సరస్వతి, రూపావాణి, ప్రతాప్, అధిక కేఎంపీఎల్ డ్రైవర్లు శివారెడ్డి, ఆర్సీరెడ్డి, వలి, దర్గయ్య, రమణ, నాయక్‌లకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ సీఐ కోటయ్య, కంట్రోలర్ ఎంఎం బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

### బండిఆత్మకూరులో ర్యాపిడ్ టెస్టులు

మహానంది: బండిఆత్మకూరు మండల కేంద్రంలో బుధవారం ప్రజలకు ర్యాపిడ్ టెస్టులు నిర్వహించినట్లు డాక్టర్ భావనారెడ్డి తెలిపారు. గ్రామంలో ముగ్గురికి డెంగీ పాజిటివ్ నమోదైనట్లు వచ్చిన వార్తల నేపథ్యంలో ఆరోగ్య కేంద్రం సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. అందులో భాగంగా బుధవారం అధిక సంఖ్యలో టెస్టులు నిర్వహించామన్నారు. ఎవరికీ పాజిటివ్ రాలేదని చెప్పారు. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టినట్లు వెల్లడించారు. ఎవరైనా జ్వరం, సంబంధిత వ్యాధులతో బాధపడుతుంటే వెంటనే స్థానిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.



రక్తపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

### నిబంధనలు పాటించాలి

కొత్తపల్లి: గ్రామీణ ప్రాంతాల వాహనదారులు రహదారి నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ హరిప్రసాద్ సూచించారు. బుధవారం మండలంలోని ఎం.లింగాపురం, కొత్తపల్లి గ్రామాల మధ్య వాహనాల తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వాహనదారులు సరైన ధ్రువపత్రాలు, లైసెన్సు, హెల్మెట్ వంటివి తప్పకుండా వద్ద ఉంచుకోవాలని సూచించారు.